www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 మార్చి 2023
5
చిత్తూరు



ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ జాగా పన్నులకు సంబంధించి పాత బకాయిలపై వడ్డీని వన్ టైం సెటిల్మెంట్ గా మాఫీ చేయడం జరుగుతుందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబరు 34 జారీ చేసిందని నగర కమిషనర్ డా. జె అరుణ తెలిపారు. పన్ను చెల్లింపుదారులు చెల్లించవలసిన పన్ను బకాయిలను వన్ టైం సెటిల్మెంట్ గా ఈ ఆర్థిక సంవత్సరంతో పాటు ఒకేసారి చెల్లించాలన్నారు. పాత బకాయిలను మార్చి 31, 2023 లోపల చెల్లించి వడ్డీ మాఫీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. పన్ను చెల్లింపులు అన్ని వార్డు సచివాలయాల్లోనూ, నగరపాలక కార్యాలయంలోని పురసేవా కేంద్రంలోనూ, ఆన్లైన్లోనూ, క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ ద్వారాను చెల్లించవచ్చని కమిషనర్ వివరించారు.

అకాల వర్షం.. వరికి నష్టం..!



తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

ప్రజాశక్తి - వి.కోట/దొరవారిసత్రం

చిత్తూరు జిల్లా వి.కోట మండల పరిధిలో గురువారం రాత్రి గాలీ, వడగళ్లవాన బీభత్సం సృష్టించింది. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. వెంకటేపల్లి, కొమ్మరమడుగు, కృష్ణాపురం తదితర గ్రామాల్లో కాకర, టమోటా, అరటి, చిక్కుడు, బీన్స్ పంటలు, పిందె దశలోని మామిడికాయలు గాలి తీవ్రతకు నేలకొరిగాయి. పలు ఉద్యానపంటలు కోత దశలు నేలమట్టమయ్యాయి. మండల పరిధిలో దాదాపు 10 లక్షలపైనే పంట నష్టం సంభవించి ఉంటుందని రైతులు వాపోతున్నారు. అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బలంగా వీచిన ఈదురుగాలులకు వి.కోట 6 పలమనేరు జాతీయ రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ రాంభూపాల్ సిబ్బందితో వెళ్లి అడ్డంగా పడి ఉన్న చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పిడుగుపడి ఆవు మృతి

దొరవారిసత్రం : తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని సింగనాలతూరులో శుక్రవారం ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షానికి పిడుగు పడడంతో ఆవు మృతి చెందింది. వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన పాసాల సుబ్రహ్మణ్యం ఆవు మేత కోసం పంట పొలాల్లోకి వెళ్లింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు రావడంతో ఆ పంట పొలాల్లో పిడుగు పడడంతో మేతమేస్తున్న ఆవు అక్కడకక్కడే మతి చెందింది. వర్షం ఉరుములు తగ్గిన తర్వాత గ్రామస్తులు చూసి ఆవు యజమానికి తెలపడంతో సుబ్రమన్యం లబోదిబోమన్నాడు. ఈ ఆవును ఇటీవల అప్పుచేసి మరీ కొన్నానని, చనిపోవడంతో నష్టం వాటిల్లిందని వాపోయాడు.

బైరెడ్డిపల్లిలో... వడగళ్ల వానకు జిల్లా పరిషత్ పాఠశాలలోని పెద్ద చెట్టు కూలిపోయింది. పాఠశాల పేరు ఉన్న బోర్డు నేలమట్టమయ్యింది. పుంగనూరు వెంగమారిపల్లి జాతీయ రహదారిలో మద్యం షాపు సమీపాన రోడ్డులో తాతల కాలం నాటి రావి, వేప చెట్టు కూలిపోయింది. బొప్పాయి, టమోటా, బీన్స్ పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు స్పందించి రైతులకు జరిగిన నష్టానికి పరిహారం అందించాలని కోరుతున్నారు.

బాలాయపల్లి: అకాల వర్షంతో వరి రైతుకు నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్రజేయడంతో వర్షం కొంపముంచింది. వడ్లు రాశులలో తడవడంతో మద్దతు ధర పలకదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వరి పంట నేలకు ఒరిగిపోయింది. వ్యవసాయ అధికారులు స్పందించిన తడిచిన పంట కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.




వర్షాలకు వాలిపోయిన అరటి, టమోటా పంటలు

చెన్నయ్-గూడూరు సెక్షన్ రైల్వే లైన్ పరిధిలో...
'సబ్‌వే అండర్ పాస్' ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చెన్నయ- గూడూరు సెక్షన్ పరిధిలోని రైల్వే లైన్ మధ్య రైళ్ల రాకపోకల వేగం గంటకు 110కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్లకు పెంచిన నేపథ్యంలో మానవ సహిత లెవల్ క్రాసింగ్‌లను మూసేసి, ప్రత్యామ్నాయ సబ్‌వే అండర్‌పాస్ ఏర్పాటుపై చెన్నయ్ దక్షిణ మధ్య డివిజనల్ ఇంజినీర్ జంషీర్, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్‌నారాయణతో కలిసి కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సమీక్షించారు. దక్షిణ మధ్య డివిజనల్ ఇంజినీర్ కలెక్టర్‌కు వివరిస్తూ నాయుడుపేట విన్నమాల రైల్వే లెవెల్ క్రాసింగ్ నంబర్ 78, తడ మండల పరిధిలో పూడి ఎల్ సి నెంబర్ 48, సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని ఎల్సి 60 లను మూసి వేస్తూ ప్రత్యామ్నాయ అండర్ పాస్ సబ్వే ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సహకారం కావాలనీ జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సబ్‌వే అండర్ పాస్ ఏర్పాటుకు ప్రజలకు అనుకూలంగా ఉండేలా ప్రతిపాదనలు, నిర్మాణ చర్యలు ఉండాలన్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని మానవ సహిత ఎల్సి 60 మూసివేయుటకు సంబంధిత మున్సిపల్ కమిషనర్, ఆర్డిఓ సూళ్లురుపేట, తాసిల్దారు రైల్వే అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి అప్రోచ్ రహదారి, అండర్పాస్ ఏర్పాటు కొరకు అంచనాలు ప్రతిపాదనలు ప్రజలకు ఇబ్బంది కలిగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని, బాల్య వివాహాల నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మితో కలిసి కలెక్టర్‌ను లక్ష్మీదేవి కలిసారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి వరకు అవగాహన కల్పిస్తామన్నారు. బాల్య వివాహాల నిరోధానికి కఠిన చర్యలు చేపడతామన్నారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ పోక్సో చట్టం, బాల్య వివాహ నిరోదక చట్టంపై అవగాహన కల్పిస్తూ18 ఏళ్ల లోపు అమ్మాయిలకు పెళ్లిచేస్తే జరిగే శారీరక, మానసిక ఇబ్బందులను వివరించారు. గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. కరోనా వల్ల అనాథలుగా మారిన వారు ఎవరైనా ఉంటే దరఖాస్తులను పంపాలన్నారు. వారికి స్పాన్సర్షిప్ కింద నెలకు నాలుగువేలు వస్తుందన్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ డి.ప్రతిమ పాల్గొన్నారు.

చెన్నయ్‌లో పద్మావతి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చెన్నయ్‌లో పద్మావతి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో జరిగింది. చెన్నయ్‌నగర వాసులు అదృష్టవంతులని స్వరూపానందస్వామి అన్నారు. ఈ వేడుకకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు. చెన్నయ్ జిఎస్ చెట్టివీధిలో టిటిడి నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం శుక్రవారం శాస్త్రోక్తంగా, అత్యంత వేడుకగా జరిగింది. శారదా పీఠాధిపతి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, చెన్నయ్ స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్‌రెడ్డి కృషితో అమ్మవారి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారన్నారు. ఆలయ నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చిన సినీనటి కాంచన, వారి కుటుంబ సభ్యులు అదృష్టవంతులని, వారికి శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి దేవి ఆశిస్సులు ఉంటాయన్నారు. తమిళనాడులో శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వేద పరిరక్షకుడని చెప్పారు. మహాకుంబాభిషేకం అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. టిటిడి బోర్డు సభ్యులు డాక్టర్ శంకర్, టిటిడి ఢిల్లీ స్థానిక సలహా మండలి ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతి, జెఇఒ వీరబ్రహ్మం, ఆగమ సలహాదారు శ్రీశ్రీనివాసాచార్యులు, ఎస్వీబీసీ సిఇఒ షణ్ముఖ్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి సిటి : శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శుక్రవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. మార్చి 20 నుంచి 28వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయాన్ని శుద్ధి చేసి, పసుపు, కుంకుమ, చందనం, సీకాయ, నామం, కర్పూరం, కిచిలిగడ్డ, కస్తూరి పసుపు, పచ్చాకు తదితరాలతో తయారుచేసిన సుగంధ మిశ్రమాన్ని గర్భాలయ గోడలకు పూశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రసన్నరెడ్డి ఐదు, తిరుపతికి చెందిన మణి నాలుగు పరదాలను, కురాళాలు, కర్టెన్లను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు నాగరత్న, గోవిందరాజన్, ఎఇఒ మోహన్ పాల్గొన్నారు.

రాజాం ఆలయం టిటిడిలో విలీనం

తిరుపతి సిటి : విజయనగరం జిల్లా రాజాం మండలం అంతకాపల్లి గ్రామంలో నిర్మించిన శ్రీ పద్మావతి సహిత భూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం టిటిడిలో విలీనం చేసింది. ఇప్పటివరకూ ఆలయాన్ని నిర్వహిస్తున్న బాలాజీ ట్రస్టు సభ్యులు శుక్రవారం టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డికి ఆలయానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఇకపై ఈ ఆలయంలో టిటిడి పద్ధతి ప్రకారం సేవలను అందించనున్నారు. ఈవో మాట్లాడుతూ గ్రంథి మల్లికార్జునరావు నిర్మించిన ఈ ఆలయాన్ని బాలాజీ ట్రస్టు పర్యవేక్షణలో, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నారని చెప్పారు. టిటిడి నిర్వహించాలని కోరడంతో ఆలయాన్ని విలీనం చేసుకున్నామని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలో ఇప్పటివరకూ 60 ఆలయాలు ఉన్నాయని తెలిపారు. టిటిడి కల్యాణ మండపాలు ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేస్తున్నారన్న ప్రశ్నకు స్పందిస్తూ కొన్నిచోట్ల కల్యాణ మండపాలు శిథిలావస్థలకు చేరుకుందని, మరికొన్నింటికీ ఆదరణ లేదన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని అలాంటి కల్యాణ మండపాల నిర్వహణ మాత్రమే కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథి ఈశ్వరరావు, గ్రంథి నీలాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ 'వైసిపి'కి..పట్టభద్రులు 'టిడిపి'కి..!

తూర్పు రాయలసీమలో ఎంఎల్‌సి ఫలితాల తీరు
ప్రభుత్వానికి పతనం ప్రారంభమయ్యింది : పీడీఎఫ్




తిరుపతిలో టిడిపి సంబరాలు



తూర్పు రాయలసీమ పట్టభద్ర ఎంఎల్‌సి కౌంటింగ్ ప్రక్రియ ఇంకనూ కొనసాగుతూనే ఉంది. శనివారం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎవరన్నది అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఉపాధ్యాయ స్థానాన్ని వైసిపి కైవసం చేసుకోగా, పట్టభద్రుల స్థానాన్ని టిడిపి అందిపుచ్చుకోనుంది. ప్రకాశం - నెల్లూరు - చిత్తూరు నియోజకవర్గ ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా వైసిపి తరపున బరిలో దిగిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. అయితే కేవలం 1043 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజేతగా నిలిచారు. ప్రభుత్వ టీచర్ల ఓటరు ఏమాత్రం ప్రలోభాలకు మొదటినుంచి చెక్కు చెదరలేదన్నది అర్థమవుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై అధికార పార్టీ ఒత్తిడి తేవడం ద్వారా ఈ విజయాన్ని కైవసం చేసుకుందన్నది రాజకీయవర్గాల విశ్లేషణ. పిడిఎఫ్ ఉపాధ్యాయ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి నైతికంగా విజయం సాధించారని ఆయా శ్రేణుల నమ్మకం. ఇక పట్టభద్రుల కౌంటింగ్ పరిశీలిస్తే టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరి భారీ మెజార్టీతోనే ఎంఎల్‌సిగా గెలుపొందనున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతోనే 27వేలకు పైగా మెజార్టీతో ముందంజలో ఉన్నారు. ఇక దొంగ ఓట్లను భారీగా చేర్పించి, రిగ్గింగ్‌కు పాల్పడిన వైఎస్ఆర్ కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో బరిలో నిలిచిన బిజెపి డిపాజిట్ సైతం కోల్పోయింది. ఇక స్వతంత్రులు చాలా స్వల్ప ఓట్లను దక్కించుకున్నారు. ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాల తీరును పరిశీలిస్తే అధికార పార్టీ వైసిపికి చాలా స్వల్ప మెజార్టీనే దక్కింది. టిడిపి పట్టభద్రుల్లో ప్రభంజనంగానే దూసుకుపోయింది. పీడీఎఫ్ అభ్యర్థులు పొక్కిరెడ్డి బాబురెడ్డి గట్టి పోటీని ఇవ్వగా, మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఏదిఏమైనా పీడీఎఫ్ తాజా సిట్టింగ్ సీట్లను అధికార, ప్రతిపక్షాలు దక్కించుకున్నాయి.

పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపు

స్వల్ప తేడాతో పీడీఎఫ్ అభ్యర్థి బాబురెడ్డి ఓటమి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, చిత్తూరు అర్బన్

ప్రకాశం - నెల్లూరు - తిరుపతి ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా వైసిపి తరపున పోటీ చేసిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. శుక్రవారం తెల్లవారుజాము వరకూ గట్టి పోటీ ఇచ్చిన పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆర్‌విఎస్ లా కాలేజీ కౌంటింగ్ ప్రక్రియ జరిగిన మూట్‌కోర్టు హాలునందు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి డిక్లరేషన్‌ను శుక్రవారం అందించారు. 16న గురువారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై 17న తెల్లవారుజామున మూడు గంటల వరకూ కొనసాగింది. ఎలిమినేషన్ ఓటింగ్ ప్రక్రియతో తన సమీప అభ్యర్థి బాబురెడ్డి పొక్కిరెడ్డిపై 1043 ఓట్ల ఆధికత్యంతో చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డి గెలుపొందారు. ఎలిమినేషన్ కౌంటింగ్ ప్రాధాన్యతా ప్రక్రియ విధానంతో మొత్తం 24,291 ఓట్లకు గానూ చంద్రశేఖర్ రెడ్డి పర్వతరెడ్డి కి 11,714 ఓట్లు, బాబురెడ్డి పొక్కిరెడ్డి కి 10,671 ఓట్లు రాగా, 1906 ఓట్లు చెల్లని ఓట్లుగా నమోదయ్యాయని తెలిపారు. డిక్లరేషన్ అందించే కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్ పాల్గొన్నారు.

పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బయోడేటా

పేరు : పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
తండ్రిపేరు : పర్వతరెడ్డి సుందర రామిరెడ్డి
తల్లిపేరు : సుజాతమ్మ
స్వగ్రామం : చిల్లకూరు మండలం, వల్లివేడు గ్రామం, తిరుపతి జిల్లా
ప్రస్తుతం : రాంజీనగర్ మూడో వీధి, చిల్డ్రన్స్ పార్కు దగ్గర, నెల్లూరు
పుట్టిన తేదీ : 26-06-1972
విద్యార్హతలు : ఎంఎస్‌సి (మ్యాథ్స్)
విద్యార్థి దశ : 1987లో నెల్లూరు డిసిఆర్ జడ్పీ హైస్కూల్లో పదో తరగతి, 1989-92లో సర్వోదయ కళాశాలలో ఇంటర్, డిగ్రీ, 1994లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎమ్మెస్సీ, అనంతరం ఎంబీఏ పూర్తి చేశారు.
ప్రస్తుతం : చైర్మన్, శ్రీ కష్ణ చైతన్య విద్యాసంస్థలు
సేవా కార్యక్రమాలు :తమ విద్యాసంస్థలో తక్కువ ఫీజుతో పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్‌గా ఉన్నారు. కోవిడ్ సమయంలో విశేష సేవలను అందించారు. ఈ సేవలకు గుర్తింపుగా 2022, ఏప్రిల్‌లో అప్పటి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నుంచి బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును అందుకున్నారు.

టిడిపికే 'పట్టం'...?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పట్టభద్రుల ఎన్నికల్లో ఎంఎల్‌సి స్థానాన్ని టిడిపి కైవసం చేసుకోనుంది. మొదటి కౌంటింగ్ పూర్తయ్యేసరికి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌చౌదరి భారీ మెజార్టీతో దూసుకుపోతున్నారు. ప్రకాశం- నెల్లూరు - చిత్తూరు పట్టభద్రులకు సంబంధించి బరిలో 22 మంది అభ్యర్థులు ఉన్నారు. 13న పోలింగ్, 15న రీపోలింగ్ పూర్తయిన నేపథ్యంలో 16న ఉదయం చిత్తూరు ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమయ్యింది. గురువారం సాయంత్రం వరకూ దాదాపు ఓట్లన్నీ బాక్సులు ఓపెన్ చేసి, కట్టలు కట్టడానికే సరిపోయింది. 40 టేబుళ్లలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరి లీడ్‌లో ఉన్నారు. గెలుపుకు అవసరమైన ఓట్లు లేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటలపైన ప్రారంభమయ్యింది.

పోలైన మొత్తం ఓట్లు : 2,69,339
గెలుపుకు అవసరమైన ఓట్లు : 1,24,181
చెల్లిన ఓట్లు : 2,48,360 **చెల్లని ఓట్లు** : 20,979

1. కంచర్ల శ్రీకాంత్ చౌదరి (టిడిపి) : 1,12,514
2. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి (వైసిపి) : 85,252
3. సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి (బిజెపి) : 6,341
4. జైపాల్ అప్పంగారి (స్వతంత్ర) : 287
5. అంకయ్యచౌదరి మక్కెన (స్వతంత్ర) : 89
6. భాస్కర్‌రావు కమ్మిశెట్టి (స్వతంత్ర) : 153
7. కరుణానిధి చిరిపిరెడ్డి (స్వతంత్ర) : 178
8. కిరణ్ దాసరన్న (స్వతంత్ర) : 126
9. కొమ్ము యెహోను (స్వతంత్ర) : 130
10. గుల్లపల్లి వీరభద్రాచారి (స్వతంత్ర) : 958
11. దొడ్ల శ్రీహరి (స్వతంత్ర) : 222
12. నక్కా దినేష్ (స్వతంత్ర) : 1,165
13. నీలం సామ్యూల్ మోసెస్ (స్వతంత్ర) : 964
14. అభినవ్ విష్ణు (స్వతంత్ర) : 107
15. పూసల రావి (స్వతంత్ర) : 290
16. పతంగి పాలంకరెడ్డి (స్వతంత్ర) : 91
17. బుస్సా రాజేంద్ర (స్వతంత్ర) : 533
18. బొట్టికాయల చంద్రశేఖర్ (స్వతంత్ర) : 84
19. మహేందర్‌రెడ్డి (స్వతంత్ర) : 58
20. మాదసి జాలారావు (స్వతంత్ర) : 334
21. మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి (పిడిఎఫ్) : 38,001
22. అలివినేని సరిత (స్వతంత్ర) : 483

సిబ్బందికి ఇబ్బందే..!
మూడు రోజుల పాటు హైరానా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పోటీచేసిన అభ్యర్థులకేమో గానీ సిబ్బందికి మాత్రం 'కౌంటింగ్' చుక్కలు చూపించింది. ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ విధులంటేనే సిబ్బందికి హైరానా. ఐఎఎస్, ఐపిఎస్ అధికారి నుంచి పారిశుధ్య కార్మికుల వరకూ వాళ్ల కష్టాలు అన్నీఇన్నీ కావు. కుర్చీల్లోనే నిద్రపోవడం, అక్కడే వంటావార్పు. ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ 16వ తేదీ గురువారం ఉదయం ఆర్‌విఎస్ కళాశాలలో ఉంటుందని ముందే ఎన్నికల అధికారులు తెలియజేశారు. చిత్తూరులోనే రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, జడ్‌పి కార్యాలయ సిబ్బంది మొత్తం ఐదు రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. లగేజీలతో సహా సర్దుకుని వచ్చేశారు. వారితో పాటు కౌంటింగ్ సిబ్బంది, అబ్జర్వర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, డిప్యూటీ కలెక్టర్లు, పోలీసులు మొత్తం జోడయ్యారు. 15వ తేదీ రాత్రి నుండే వాళ్లకు చుక్కలు కనిపించాయి. భద్రత విషయంలో పోలీసులు, కానిస్టేబుళ్లు, పారిశుధ్యం విషయంలో మున్సిపాలిటీ వారు, వంటావార్పు విషయంలో రెవెన్యూ అధికారులు, మెటీరియల్ అందించడంలో జడ్‌పి సిఇఒ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఇక్కడే ఉన్నారు. కౌంటింగ్‌కు వచ్చే సిబ్బంది మొత్తం మూడు రోజుల పాటు సిద్ధమై రావాలని చెప్పడంతో లగేజీ సర్దుకుని వచ్చేశారు. సహజంగా ఏ విధులకు వెళ్లినా రాత్రుల్లో విశ్రాంతి ఉంటుంది. అయితే ఎంఎల్‌సి కౌంటింగ్ విషయంలో మూడు పగళ్లు, మూడు రాత్రులు షిఫ్ట్‌ల వారీగా డ్యూటీలు చేస్తూ అలిసిపోయారు. టీచర్ల కౌంటింగ్ శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు ముగిసింది. ఐదు గంటలకు ఆ సిబ్బంది ఇళ్లకు బయల్దేరడానికి సిద్ధమయ్యారు. అయితే పట్టభద్రుల ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, భాగస్వామ్యం కావాలని రిటర్నింగ్ అధికారి ఆదేశించడంతో ఉసూరుమంటూ కూర్చున్నారు. ఏ కౌంటింగ్ సిబ్బంది మొహం చూసినా, కానిస్టేబుళ్ల మొహం చూసినా అలసట స్పష్టంగా కనిపిస్తోంది. వీరితో పాటు ఏజెంట్లు, ఆయా అభ్యర్థులు, మీడియా సైతం మూడు రోజుల పాటు ఆ కళాశాల వద్దనే తిష్టవేసుకుని ఉండాల్సిన గత్యంతరం లేని పరిస్థితి.



రోడ్డు పక్కనే నిరీక్షణ

చెల్లని ఓట్లే అధికం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అందరూ మేధావులే.. విద్యావంతులే.. అయినా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో చెల్లని ఓట్లు వేలల్లో ఉండటం గమనార్హం. రెండు మూడు వేలు కాదు, ఏకంగా ఉపాధ్యాయ, పట్టభద్రులు అన్నీ కలిపి 21,144 ఓట్లు. టీచర్స్ ఎన్నికల్లో 435 ఓట్లు చెల్లనివిగా ఉన్నాయి. ఏవిధంగా చెల్లకుండా పోయాయంటే.. నచ్చిన అభ్యర్థికి టిక్ పెట్టడం, ఇంటూ పెట్టడం చేశారు. ఒకటి వేసి 'ఫస్ట్' అని ఇంగ్లీష్‌లో రాయడం.. ఇంకుతో వేలిముద్రలు వేయడం జరిగాయి. గతంలో ఉపాధ్యాయ ఎన్నికల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులే ఓటు వేసేవారు. అప్పట్లో చెల్లని ఓట్లు పదుల సంఖ్యలోనే ఉండేవి. ఈసారి అధికార పార్టీ ఓట్ల కోసం ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఓటు హక్కు కల్పించడంతో ఎక్కువగా చెల్లని ఓట్లు వచ్చాయని చర్చ నడుస్తోంది.

ఇక పట్టభద్రుల విషయానికి వస్తే నవ్వుకోక తప్పదు. 20,979 ఓట్లు చెల్లకుండా పోయాయి. మీడియా ఏజెంట్లను ఆరా తీయగా 80 శాతం ఓట్లు వైసిపికి పడినవే చెల్లకుండా పోయాయని చెప్పడం గమనార్హం. వేలిముద్రలు, ఇంటూ పెట్టడం, టిక్ కొట్టడం, నా ఓటు శ్యాంప్రసాద్‌రెడ్డికే అని ఎదురుగా రాయడం ఇలా చిత్ర విచిత్రాలుగా ఉన్నాయి. డిగ్రీలు పూర్తికాని నిరక్షరాస్యులను ఓటర్లుగా తీసుకురావడం వల్లనే ఇన్ని ఓట్లు చెల్లకుండా పోయాయని తెలుస్తోంది. గెలిచిన అభ్యర్థి ఎంత మెజార్టీతో ఉన్నారో, దగ్గరదగ్గర చెల్లని ఓట్లూ అన్నే ఉండటం గమనార్హం.

వైసిపి పతనం ఆరంభం : సిఐటియు

తిరుపతి టౌన్ : ప్రజలతో ఘర్షణ పెట్టుకుని ప్రజా వ్యతిరేకంగా తయారైన వైసిపి ప్రభుత్వ పతనం ప్రారంభమయ్యిందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో విమర్శించారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థుల ఓటమే దీనికి సూచికని పేర్కొన్నారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన సాధారణ వ్యక్తులను సైతం టీచర్ ఓటర్లుగా నమోదు చేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నించిందని, ఓటరుకు ఐదు నుంచి పదివేల రూపాయలు పంచిపెట్టి తప్పుడు వ్యవహారానికి పాల్పడ్డారన్నారు. ఈ కారణంగానే పీడీఎఫ్ అభ్యర్థులు ఎన్నికల్లో హోరాహోరీగా పోరాడి అపజయాన్ని చవిచూశారన్నారు. పీడిఎఫ్ అభ్యర్థులు నైతిక విజయం సాధించారని పేర్కొన్నారు. ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అప్రజాస్వామికంగా ఉందన్నారు.

నాగాలమ్మ చెరువు కట్ట ధ్వంసం..!

- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- అధికారులు స్పందించాలని వినతి

ప్రజాశక్తి-రామకుప్పం: స్థానిక దిగువ వీధిలోని నాగాలమ్మ చెరువు కట్టను కొంతమంది తమ స్వార్థానికి ధ్వంసం చేశారు. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. సంవత్సరమంతా చెరువులో నీరు పుష్కలంగా ఉంటుంది. నిత్యం ఈ చెరువు కట్ట మీదుగా రైతులు, స్థానికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి చెరువు కట్టను గురువారం కొంతమంది తమ ప్రైవేటు భూములకు వెళ్లేందుకు అనుకూలంగా సుమారు 10 అడుగుల మేర వెడల్పుతో జెసిబి ద్వారా కట్టను తవ్వి రోడ్‌ను వేశారు. దీంతో కట్ట సగ భాగం కుచించుకుపోయి ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకు వస్తుందోనని చెరువు ఆయకట్టు రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు భూములకు వెళ్లేందుకు ప్రభుత్వ చెరువు కట్టను నాశనం చేయడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ ఘటనపై శుక్రవారం పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించి న్యాయం చేయాలని కోరారు. ఇకనైనా ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువు కట్టను తవ్విన దృశ్యం



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే



ప్రజాశక్తి-పాలసముద్రం: సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు, విద్యార్థినుల ఆత్మ రక్షణకు కరాటే అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, కరాటే మాస్టర్ గుణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని స్థానిక అరుణోదయ పాఠశాలలో జపాన్ షిటో రై కరాటే ఇండియా వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం అవుతుందని సూచించారు. ఈ రోజుల్లో విద్యార్థినులు, మహిళలు కరాటే, మార్షియల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యం పెంపొందించుకోవడానికి రోజూ క్రమం తప్పకుండా శిక్షణ తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా చిన్ననాటి నుంచే విద్యార్థినులకు కరాటే, కర్ర సాము శిక్షణ ఇప్పించడం అత్యవసరమన్నారు. అనంతరం కరాటే పోటీల్లో విద్యార్థులు పలు విన్యాసాలు ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సినీ ఫైట్ మాస్టర్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే రీసర్వే లక్ష్యం

ప్రజాశక్తి-పాలసముద్రం: భూ సమస్యల పరిష్కారమే రీసర్వే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తహశీల్దార్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ పరిధిలో రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్షణ పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రీ సర్వే చేయడంతో శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రీ సర్వే చేయడానికి రైతులు వారి పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫోటో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ తప్పకుండా సంబంధిత విఆర్‌ఒలకు అందించాలని తెలిపారు. రైతులు, ప్రజలు రీ సర్వేకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వే కిరణ్ కుమార్, విలేజ్ సర్వే అలీ బాష, వాలంటరీ సత్తివేల్, రైతులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు గౌహర్ సుల్తాన అధ్యక్షతన శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు అందులో భాగంగా పురోహితులు శ్రీ సరస్వతి పూజ నిర్వహించి, పూల అలంకరణతో ఓం చిత్రీకరించి, విద్యార్థులు క్యాండిల్‌తో దీపారాధన చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో విద్యార్థినిలు ఆశీర్వాదం పొందారు. విద్యార్థినిలకు స్వీట్లు, ఒక విద్యార్థినికి స్వీటు, బహుమతిని అందించారు. బహుమతి అందుకున్న విద్యార్థిని ఎంఈఓ సాయి లీలకు ఆ బహుమతిని చూపించి సంతోషపడింది. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో అందరూ రాబోయే పరీక్షల్లో అధిక మార్కులు సంపాదించి ఉన్నత స్థాయికి ఎదిగేలా వారి బాటను నిర్ణయించుకోవాలన్నారు. విద్యార్థినిలు ముందుకు సాగి మీ తల్లిదండ్రులకు, మీకు బోధించిన ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలో కొత్తగా మంజూరైన ఇండ్లు, జగనన్న కాలనీ ఇండ్ల పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎస్ విద్యావతి తెలిపారు. శుక్రవారం ఐకెబి కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, సంఘమిత్రలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీలో ఇండ్లు మంజూరై కట్టుకోకుండా ఉన్న లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి గృహ నిర్మాణ పనులు చేయాల్సిన బాధ్యత సంబంధిత ఇంజనీరింగ్ హాస్టల్ పై ఉందని తెలిపారు. జగనన్న కాలనీలో ప్రభుత్వం సిసి రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి ఎన్నో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు డ్వాక్రా సంఘాల్లో ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు సంబంధిత సంఘమిత్రాలు డ్వాక్రా సంఘాల్లో రుణాలు ఇప్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఐకెబి ఎపిఎం ఫరీద్ మస్తాన్, సిసి చిరంజీవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సంఘమిత్రాలు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: పెద్ద ఉప్పరపల్లి ఆరోగ్య కేంద్ర పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను శుక్రవారం పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణ దినోత్సవాల సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల అధ్యక్షులు ఎల్లప్ప శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాటి గుంట పాలెంకు చెందిన సతీష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.60 లక్షల చెక్కును, గొంగి వారి పల్లికి చెందిన మల్లీశ్వర రెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.18 వేల చెక్కును వారి వారి కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున రెడ్డి, గిరినాథ్ రెడ్డి, నారాయణరెడ్డి, దేవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-నగరి: తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ అఖండ విజయాన్ని సాధించడంతో స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌ను అభినందిస్తూ, ఆయన గెలుపు కోసం కృషిచేసిన టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు, పట్టభద్రులకు స్థానిక టీడీపీ నాయకులు కతజ్ఞతలు తెలిపారు. నగరి టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం/వెదురుకుప్పం: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ భారీ మెజార్టీ వైపుగా దూసుకెళ్లడంతో గెలుపు కాయం కావడం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెంప పెట్టని మండల తెలుగు దేశం అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో భారీ ఎత్తున టపాకాయలు పేల్చి స్వీట్లు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. పట్టభద్రుల ఎన్నికలలో పట్టభద్రులు తమ సత్తా చాటారని ఎక్కువగా ఓటర్లు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతలోనే ఇంత వ్యతిరేకతుంటే సామాన్య ఎన్నికలు నిర్వహిస్తే తెలుగుదేశం గాలికి వైసీపీ కొట్టుకుపోతుందని ఆయన అన్నారు.

వెదురుకుప్పం మండల కేంద్రంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహం దగ్గర తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ ముందంజలో ఉండటంతో గెలుపు ఖాయం, బాణా సంచులు టపాసులు పేల్చారు. టీడీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

సోమల: చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కంచర్ల శ్రీకాంత్ ఘన విజయం సాధించడం ఖాయమని మండల కేంద్రమైన సోమల, పెద్ద ఉప్పరపల్లి బస్టాండ్ కూడళ్లలో మండల టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.



పెద్దఉప్పర పల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి బాణా సంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు కార్యకర్తలు బాణా సంచా పేల్చి సంబ రాలు చేసుకొని అందరికీ మిఠాయిలు పంచి పెట్టారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుప్పం: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎలక్షన్‌లో భాగంగా టీడీపీ బలపరిచిన వ్యక్తులు ముందంజలో ఉండడంతో స్థానిక ఆ పార్టీ నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా గుడిపల్లి మండలంలో బాణసంచాలు కాల్చి, మిఠాయిలు పంచుకుని వారి ఆనందాన్ని వ్యక్తపరిచారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకుప్పం: తూర్పు రాయలసీమ నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు పట్టభద్రుల టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ ఓట్ల లెక్కింపులో ముందంజలో ఉన్నందున మండల కేంద్రంలోని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని దీనికి ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనం అన్నారు. రానున్న రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించి చంద్రబాబుని సీఎం చేయడం తధ్యమన్నారు. రామకష్ణప్ప, సుబ్రి, సతీష్, అమర్, ఆదిల్, నియాజ్, అవినాష్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, షాదిక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలతోనే మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థికాభివద్ధి కుటీర పరిశ్రమలతోనే సాధ్యమని డిఆర్‌డిఎ పిడి తులసి అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని బొమ్మవారి పల్లెలో రూరల్ యాక్షన్ స్వచ్ఛంద సేవా సంస్థ, కాయర్ బోర్డు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొబ్బరి పీచుతో అనేక ఉత్పత్తులను తయారు చేయవచ్చని, స్వల్పకాలిక శిక్షణతో మహిళలు ఉపాధి పొందడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కష్ణ కిషోర్ మాట్లాడుతూ కుటీర పరిశ్రమలతో లక్షలాదిమంది మహిళలు ఉపాధి పొందుతున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలపై అవగాహన కల్పించడానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ వినోద్ కుమార్, వైఎస్ఆర్ టియుసి జైన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, ఐకెపి ఎపిఎం చిరంజీవి, వేల్కూరు క్రాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు భూపతి, సింధూర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రవి, మహిళా సంఘాలు పాల్గొన్నాయి.



ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-గంగవరం: దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజల మధ్య సంబంధాలు, ఐక్యత పెంచాలనే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం అనే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం మదర్ తెరిసా ఇంజినీరింగ్ కళాశాలలోని ఈసీఈ విద్యార్థులకు దక్కిందని కళాశాల కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుంచి 55 మంది విద్యార్థులకు అవకాశం రాగా అందులో చిత్తూరు జిల్లా నుండి 5 మంది విద్యార్థులకు అవకాశం వచ్చిందని, వారు మదర్ తెరిసా కళాశాలలోని ఇంజినీరింగ్ విభాగానికి చెందిన లక్ష్మి, వెన్నెల, మనోజ్ సాయి, దిలీప్, సుఫియా లని, వీరికి అవకాశం లభించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన 55 మంది విద్యార్థులు ఈ దేశంలోని పలు ప్రాంతాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోజు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రదేశాలను సందర్శించి అక్కడ ఆచార సంప్రదాయాలను వారి నాగరికత పరిస్థితులను మొదలగు విషయాలను అవగాహన చేసుకుని అక్కడ ప్రజలతో మమేకమయ్యారు. అదేవిధంగా భారత్ చైనా సరిహద్దు ప్రాంతంలోని ఆర్మీ కేంద్రాన్ని సందర్శించి సైనికుల అనుభవాలను వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పలు రాష్ట్రాల్లోని విద్యా శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లను, మొదలగువారుతో కలిసి విద్య విశాఖ విషయాలపై అవగాహన పెంచుకున్నారు. ఇదే సందర్భంలో జరిగిన వివిధ ఆటల పోటీలలో ప్రత్యేక బహుమతులు గెలుచుకున్న వారిని కరస్పాండెంట్ అభినందించారు. అకాడమిక్ డైరెక్టర్ ఎం.ఆర్ సునీల్, ప్రిన్సిపల్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, హెచ్.ఓ.డి లక్ష్మీ కాంత్ రెడ్డి, ఎన్.ఎ.ఎ.సి కోఆర్డినేటర్ శ్రీరామ్మూర్తి, మురళీకష్ణ తదితర అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



ఇన్‌ఛార్జి ఎంఈవోగా బాబయ్య



ప్రజాశక్తి-కార్వేటినగరం: ఇన్‌ఛార్జి ఎంఈఓ గా ఎ.బాబయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నాగలాపురం మండలం ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న బాబయ్య జిల్లా అధికా రుల ఆదేశాల మేరకు కార్వేటినగరం ఇన్‌ఛార్జి ఎంఈఓ గా బదిలీ అయినట్లు తెలిపారు. ఇంతకు ముందు కార్వేటి నగరం ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న విజయకుమార్ మెడికల్ సెలవుల్లో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ మండలంలో విద్యాభివద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయులు అందరూ సమయపాలన పాటించి, అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం ఆయన్ను పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు కలిసి సన్మానించారు.

శ్రీ సర్వేశ్వర స్వామి కుంభాభిషేకం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని మునిపల్లిలో శుక్రవారం ఘనంగా శ్రీ సర్వేశ్వరస్వామి కుంబాభిషేకం నిర్వహించారు. మునిపల్లి గ్రామ సర్పంచ్ రాజారెడ్డి అలియాస్ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎం.నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం శ్రీ సర్వేశ్వర స్వామి శివలింగం, నవగ్రహ ప్రతిష్టాపన, కుంబాభిషేకం చేశారు. ఉదయం అష్ట బంధన, మూల విగ్రహ ప్రతిష్ట, విమాన గోపురం కళాస్థాపన, వ్యాధి ప్రాణ ప్రతిష్ట, ప్రధాన, నవగ్రహ, పరిహార, శాంతి తదితర హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కవితశ్రీకి సుజన సాహితీ పురస్కారం



ప్రజాశక్తి-పలమనేరు: దివంగత కరణం శేషపిళ్లై జ్ఞాపకార్థం, సాహిత్య రంగంలో సేవ చేసే సజనకారులకు అందించే సుజన సాహితీ పురస్కారానికి ఈ సంవత్సరం ప్రముఖ కవి, సాహితీ విమర్శకులు కవితశ్రీ ఎంపికయ్యారని పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్, కార్యవర్గ సభ్యులు కె సాయి, యుగంధర్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. వాయల్పాడు డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ కవితశ్రీ (డేరంగుల శ్రీనివాసులు) కి ఈ ఆదివారం సుజన సాహితీ పురస్కారాన్ని అందజేయను న్నట్లు వారు తెలిపారు. రూ.5 వేలు, మొమెంటోతో కవితశ్రీని ఆదివారం గంగవరం సాయి గార్డెన్ సిటీ కళాక్షేత్రంలో సత్కరిస్తున్నట్లు వారు తెలిపారు. ఆయన వెలువరించిన "ఇచట దుమ్ము దుల పబడును" సాహిత్య విమర్శ సంపుటి సాహితీ విశ్లేషకుల ప్రశంసలను అందుకుందని తెలిపారు. గతంలో ఈ పురస్కా రాన్ని ప్రముఖ సాహితీవేత్తలు బండ్ల మాధవరావు కి, ప్రముఖ అవధాని ఆముదాల మురళికి ప్రదానం చేసినట్లు వారు తెలిపారు.

కార్మికులకు రూ.26 వేల జీతం ఇవ్వాలి



ప్రజాశక్తి-నగరి: స్కీం కార్మికులకు రూ.26 వేల జీతం ఇవ్వాలని విజయవాడలో ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన స్కీం కార్మికుల సమస్యలు పరిష్కరించి జీతాలు పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బిల్లు రేట్లు పెంచాలని కోరుతూ స్థానిక అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ నందు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాలో చిత్తూరు జిల్లా అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ ఆయాలు, స్కీం కార్మికులు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రేమ, రాధమ్మ, శాంతి, జ్యోతి, చంద్రకళ, లక్ష్మీనరసమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు చందా మరి, గీత, మాధవి, రూప, స్కూల్ ఆయమ్మ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జై కుమారి, మంజుల, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీ



ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని కళియంబకం, మాధవరం సచివాలయం పరిధిలోని క్షయ వ్యాధి గ్రస్తులకు సర్పంచ్ మమత, ఉపసర్పంచ్ మంగ ముత్తు పోషక ఆహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి గ్రస్తులు మంచి పోషకాహారం తీసుకుంటే త్వరగా నయమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సోమశేఖర్, వైద్య సిబ్బంది, సిహెచ్ఓ సుబ్బరామమ్మ, పిహెచ్ఎం అన్నపూర్ణమ్మ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటలపై సస్యరక్షణ చేపట్టాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పంటలపై సస్యరక్షణ చేపట్టాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాలేరు, తిమోజి పల్లి సచివాలయాల్లోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజను లో పంట నమోదు జాబితా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శన చేపట్టాలన్నారు. గ్రామాల్లో రైతు గ్రామసభలు ఏర్పాటు చేసి పొలంబడి గురించి చర్చించాలన్నారు. పంట సాగు చేసి వారు క్షేత్రాన్ని సందర్శించి తీసుకోవాల్సిన చర్యలు రైతులకు తెలపాలనే ఉద్దేశ్యంతో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరిలో సస్య రక్షణ, జీవామతం తయారీ విధానం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు సలహాలు అందివ్వాలన్నారు. మండల వ్యవసాయాధికారి పద్మజ, సచివాలయ రైతు భరోసా కేంద్ర సిబ్బంది పుష్పాంజలి, లావణ్య, మూర్తి, ఆనంద్ రాజ్, రైతులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని వైద్యశాలలో రోగులకు, పేదలకు లయన్స్ క్లబ్ ఆఫ్ సదుం మణికంఠ ఆధ్వర్యంలో కువైట్‌కు చెందిన హరినాథ రెడ్డి దంపతులు వైద్యశాలకు దుప్పట్లు, తలగడలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ రెడ్డి, కష్ణారెడ్డి, రాజారెడ్డి, వైద్యులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల ధర్నా



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సకాలంలో తమకు జీతాలు రాకుంటే మా కుటుంబ జీవనం ఎలా సాగాలని పలువురు సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వరత్తూరు బస్‌స్టాప్ నందున్న కెసిసి కన్‌స్ట్రక్షన్ కంపెనీ స్టాక్ పాయింట్‌లో శుక్రవారం ఆ కంపెనీలో పని చేసే సెక్యూరిటీ గార్డులు జీతాల కోసం సుమారు గంటపైగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణ పనులు చేసే చోట వోల్కనో ఏజెన్సీలో వివిధ గ్రామాలకు చెందిన 60 మంది వ్యక్తులను సెక్యూరిటీ గార్డులుగా నియమించుకున్నారని, అయితే గత 4 నెలలుగా జీతాలు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తూన్నారని ఆరోపించారు. ఈ సమాచారం తెలుసుకున్న కెసిసి కన్‌స్ట్రక్షన్ కంపెనీ అధికారి పాండే, వోల్కనో ఏజెన్సీ ఇన్‌ఛార్జ్ శోభిత్‌లు ధర్నా చేస్తున్న సెక్యూరిటీ గార్డులతో చర్చలు జరిపి, వారి హామీ మేరకు సెక్యూరిటీ గార్డులు ధర్నా విరమించి విధులకు వెళ్లారు.

నరివేపానికొండపై మంటలు



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రానికి సమీపంలో గుర్తుతెలియని ఆకతాయిలు నరివేపానికొండకు నిప్పు పెట్టడంతో నలువైపులా అగ్నికీలలు అలముకుని కొండ కిందభాగం నుండి పై వరకు పూర్తిగా కాలిపోయింది. ఈ కొండపై సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉండడం గమనార్హం. అటవీ శాఖ వారు మండలంలో అడవులకు నిప్పు మానవాళికి ముప్పు అన్న నినాదంతో ఎక్కడా అవగాహన కల్పించలేదు. దీంతో ఇటీవల నెల రోజులుగా మండలంలో ఏదో ఒక ప్రాంతంలో అడవులు అగ్నికి ఆహుతి అవుతూనే ఉన్నాయి. ఇకనైనా అటవీ శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి విలువైన అటవీ సంపద, వన్యప్రాణులు అగ్నికీలల్లో దహించుకుపోకుండా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫోటో: ఎర్రని మంటల్లో దహనం అవుతున్న నరివేపానికొండ

ఇంటిని ఆక్రమించారని పోలీసులకు ఫిర్యాదు



ప్రజాశక్తి-రొంపిచెర్ల: నా ఇంటిని ఫోర్జరీ సంతకాలతో రాయించుకొని ఆక్రమించుకున్నారని బాధితురాలు పి.రహమత్ బి స్థానిక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు వివరాల మేరకు... స్థానిక గ్రామపంచాయతీ బజారు వీధికి చెందిన పాలగిరి రహమత్ బికి బొమ్మాయ్యగారిపల్లి గ్రామ పంచాయతీలోని రొంపిచెర్ల క్రాస్‌లో సర్వే నెంబర్ 829-3 బి లో మూడు సెంట్లు భూమిని పక్కా ఇండ్ల నిర్మాణానికి పట్టా ఇచ్చారు. దీంతో ఆమె కూలీ నాలి చేసి 3 సంవత్సరాల క్రితం ఇంటి పనులు ప్రారంభించి సంవత్సరం క్రితంపూర్తి చేసుకు న్నట్లు తెలిపారు. అప్పటినుండి కరెంటు బిల్లులు, ఇంటి పన్ను తనే చెల్లిస్తున్నట్లు తెలిపారు. తనకు భర్త, పిల్లలు లేరని తెలిపారు. అయితే తన ఇంటిని తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం గుల్లవాండ్లపల్లికి చెందిన తన తమ్ముడు సాఫిర్, అతని భార్య ఖాదర్ బి వారిద్దరు కలిసి తన ఇంటిని వారికి ఉచితంగా ఇచ్చినట్లు వంద రూపాయల స్టాంపులలో తన తమ్ముడు భార్యకు అతనే వ్రాసి ఇచ్చినట్లు తన సంతకాన్ని ఫోర్జరీ చేసి వ్రాసుకున్నారని తెలిపారు. గురువారం సాయంత్రం తన ఇంటి బీగాలను పగలగొడుతున్నారని తనకి కొందరు చెప్పడంతో వెళ్లి అడ్డుపడినట్లు తెలిపారు. దీంతో తనపై తమ్ముడు, ఆమె భార్య దాడి చేసినట్లు తెలిపారు. గడ్డపార, కొడవలి ఎత్తుకొని రావడంతో అక్కడనుండి తప్పించుకొని వచ్చానని తెలిపారు. తనకు తమ్ముడు సాయిపీర్, అతని భార్య ఖాదర్ బి వల్ల ప్రాణహాని ఉందని వివరించారు. తనకి రక్షణ కల్పించి, తన ఇంటిని అప్పగించాలని పోలీసులకు మొరపెట్టుకున్నారు. రొంపిచెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


ప్రజాశక్తి-సోమల: పరిసరాల పరిశుభ్రత తోనే గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని రమ్యశ్రీ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆరోగ్య కేంద్ర పరిధిలోని పాఠశాలల్లో, సచివాలయాల్లోని తాగునీటి ట్యాంకుల్లో, కొళాయిల వద్ద బ్లీచింగ్ ద్రావణాన్ని కలిపారు. అదేవిధంగా ఇళ్ల వద్ద నీటి తొట్టెల్లో అబిట్ ద్రావణాన్ని లార్వాలు వద్ధి చెందకుండా మిశ్రమం చేశారు. మురుగు నీటి కాలువల్లో, అపరిశుభ్రత కలిగిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు చల్లి ప్రజలకు పలు సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ జయలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే బంగారు రుణాలు



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: రైతుల చేయూత కోసమే సింగిల్ విండో సొసైటీ ద్వారా తక్కువ వడ్డీతో బంగారం మీద రుణాలు అందించినట్లు నాబార్డ్ డీడీఎం సునీల్, ఆప్కాబ్ ప్యాక్స్ డెవలప్‌మెంట్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిసిసిబి ప్యాక్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. సింగిల్ విండో సొసైటీలో బంగారం తాకట్టు పెట్టుకొని రుణాలు ఇచ్చే సౌకర్యాన్ని మళ్ళీ కొత్తగా పలువురు అధికారులు కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు కలిగిన రైతులకు బంగారం తాకట్టు పెట్టుకొని ఏడు శాతం వడ్డీతో రుణం ఇస్తామని, భూమిలేని రైతులకు బంగారం తాకట్టు పెట్టుకొని 10 శాతం వడ్డీతో ఇస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్, సింగిల్ విండో సీఈవో విజయ కుమార్ రెడ్డి, సొసైటీ అధికారులు మునస్వామి, ఆనంద్, డైరెక్టర్ మనివాసన్ పాల్గొన్నారు.

పాఠశాల నిధుల దుర్వినియోగం



ప్రజాశక్తి-నగరి: మండలంలోని బీరకుప్పం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల నిధులను డ్రా చేసి సక్రమంగా వినియోగించడకుండా దుర్వినియోగం చేస్తున్నారని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. శుక్రవారం బీరకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. తనిఖీల్లో నిధులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు లేవు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లు సరిదిద్దడం లేదన్నారు. ఉపాధ్యాయుల డైరీ, పాఠశాల రికార్డులు, రిజిస్టర్లు ఏవీ సక్రమమైన పద్ధతిలో లేవన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న సహోపాధ్యాయుడు సోమయ్య పైవన్నీ సక్రమంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెకి తరలిన టీడీపీ నేతలు

ప్రజాశక్తి-రామకుప్పం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు శుక్రవారం మండల స్థానిక ఆ పార్టీ నేతలు తంబళ్లపల్లి నియోజకవర్గానికి తరలి వెళ్లారు. పాదయాత్ర 4 వేల కిలోమీటర్లు ఏ అడ్డంకులు లేకుండా నిర్విఘ్నంగా జరగాలని రామకుప్పం లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, విజయ్ కుమార్ రెడ్డి, బాలరాజు, మంజునాథ్, వెంకటరమణ, సురేష్, చంద్రశేఖర్ రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.